# మూడుముళ్ళు

'పంతులూ! మన మెక్కడికి పోతున్నాం?' గుండెగుబులును, అధిమిపెట్టి పాతికేళ్ల వయసు పరువాలను దాచలేనంటున్న పైటను భుజాల మీదుగా కప్పుకున్న పార్వతి హరినాధశాస్త్రి భుజమ్మీద ఒరిగి కూచుంది. రిక్షాకుదుపులు వయసు సొగసుల్ని ఊగిస్తున్నాయి. కల్లాకపటం తెలీని బాల్యంలా రిక్షా సిటీ తార్రోడ్డు మీద సాఫీగా పరుగెడుతోంది.

'మా మేనత్త ఇంటకి' పార్వతి భుజాలను పొదివి పట్టుకున్న హరినాధశాస్త్రి టీ.వీ. అనౌన్సర్‌లా నవ్వేశాడు. 'నువ్వెప్పుడూ సిటీ చూడలేదు గదా. పరేశానొద్దు. మా మేనత్త చాలా మంచిది. నిన్ను తన కూతురులా చూసుకుంటుంది. వంటపని, నీకేమీ చెప్పదు.

రిక్షా... విశాలమైన రోడ్డు మీంచి సన్నని సందులోకి మళ్లింది. పార్వతి ఎదలో ఏదో పులకింత. ఇప్పట్నుంచి ఇక హాయిగా ఉండొచ్చు. పంతులూ నేనూ.... చిలకా గోరింకల్లా.... సుఖంగా బతకొచ్చు. "మరీ... మనమెప్పటకీ మీ మేనత్త ఇంట్లోనే ఉందామా" ముద్దుబంతిలా విచ్చుకుంది. మొహం.

"ముందు ఓ నెలరోజులుందాం. ఈలోగా ఆవిడ వాలకం చూద్దాం. మనకు బాగన్పించకపోతే వేరే గది చూసుకుందాం. అప్పటికి నెల జీతం చేతికొస్తుంది గదా!" కళ్లలోకి చూశాడు. రిక్షా మరో మలుపు తిరగింది.

నిజమే! పంతులు ఉద్యోగానికెల్తుంటాడు, నేనింట్లో ఉంటాను. రోజూ సాయంత్రం సినిమాలకు, షికార్లకు తిరగొచ్చు... ఆశల పల్లకి ఊహల ఉయ్యాల లూగించింది. మనసు పొరల్లోని ఆనందం పెదాలను కదిలించింది. అంతలోనే అనుమానం పురుగు రెక్కలు విప్పింది. ముంగురులను సవరించుకుంది. 'కానీ.. మీరేమో బ్రాహ్మలు. నేనేమో పార్వతిని. మీ మేనత్త ఏమంటుందో' ముద్దబంతి మీది తుమ్మెద రెక్కల్లో కను రెప్పలు టపటప లాడినై.

'అదేం లేదు. మా మేనత్త గూడా మన బాపతే' సినీ హీరోలా నవ్వేశాడు. సందుల మలుపులను తన వలపుల గిలకతో పోల్చుకుంటున్నాడు.

కండబలాన్ని, గుండెబలాన్ని పిక్కల్లోకి తెచ్చుకొని రిక్షా తొక్కుతున్న రంగన్న అంతా వింటున్నాడు, గమనిస్తున్నాడు.

పాపాలను, శాపాలను ప్రగతి బాటలో పయనింపజేసే చీకటి పరదాలు సిటీ ఇంటినిండా పాకుతున్నాయి. అప్పుడే ప్రాణం పోసుకున్న వీధీలైట్ల వెలుగులు ఆ పరదాల సరదాలను చీల్చి చెండాడుతున్నాయి. పార్వతి చెక్కిళ్లమీద పరావర్తనం చెందుతున్నాయి. అనుమానం చూపులను, అవమానాలను అన్నిటినీ అక్కడే వదిలేసి హరినాధశాస్త్రితో లేచిపోవడం అదృష్టమే. భవిష్యత్తు బంగారు బాట.... విరిసీవిరయని చిరునవ్వు పార్వతి ఎర్రని పెదాలమీద తెల్లగా మెరిసింది.

అప్సరసలాంటి అమ్మాయిని లేపుకొచ్చి అప్పజెప్తానని జగదాంబ కంపెనీలో అడ్వాన్సు తీసుకొని ఆర్నెల్లైంది. ఆవిడ పోరు భరించలేక పోతున్నాను. ఈ రోజుతో జగదాంబ పోరు తీరుతుంది. మాట నిలబడుతుంది.... హరినాథశాస్త్రి తుంటరి చూపులు ఆవిడ ఒంటి సొంపుల్ని కొత్తగా తడుముతున్నాయి.

ఈ బేకార్ శాస్త్రిగాడు ఎప్పుడూ ఒక్కడే వచ్చేటోడు. ఇప్పుడు జంటగా..... ఈ పిల్లను లేపు కొస్తుండేమో!.... అనుకుంటూ రిక్షాకు బ్రేకులు వేశాడు రంగన్న.

ఎప్పట్నుంచో ఎదురుచూస్తున్నట్టు... ఆత్రంగా అరుగు దిగి ఎదురొచ్చిందో సగమీదు సుందరి దవడ నిండా కిళ్లీ, ఒంటి నిండా ఫాన్సీ చీర, భృకుటి నిండా కుంకుమబొట్టు.... కళ్లూ, ఒళ్లు కదిలిస్తూ అడిగింది.

'తెచ్చినావా శాస్త్రీ'

'ఆ ... తెచ్చిన జగదాంబత్తా! ఇదిగో నీ కూతురు.'

రిక్షా దిగుతున్న పార్వతిని కళ్లతో చూపించాడు. 'ఇక తల్లివైనా, అత్తవైనా... అన్నీ నువ్వే' కళ్లతో సైగ చేస్తూ పళ్లతో నవ్వాడు.

జగదాంబ కళ్లు జిగేల్ మన్నాయి. ఆశ తళుక్కుమంది.

వారెవ్వా! ఇది... బంగారు పిట్ట! ఆనందం. సంతోషం.

ఆ ఇరుకు సందులో ఆదొక్కటే ఇల్లు. ఇంటి నుదుటి మీద ఎర్రని జీరో బల్బు... లోపలున్న అంగడి బొమ్మల రక్తాన్ని ఇంధనంగా వాడుకుంటున్నట్టు వెలుతురు విరజిమ్ముతోంది.

'అమ్మో బక్క శాస్త్రీ! ఏమో అనుకున్నా మాట మీద నిలబడే మనిషే చటుక్కున పార్వతి చెయ్యందుకుంది. పోరి పిటపిటలాడ్తుందయ్యోయ్!.... జగదాంబ మురిసి పోతోంది.

'థాంక్యూ అత్తయ్యా! లోపలికి పదా!"

'పదా!' బెదురుచూపుల పార్వతిని కొరుక్కుతింటున్నట్టు చూసి జబ్బ అందుకుంది. 'లోపలికి నేను దీస్కపోత, మిగితా బాలెన్సు.. తర్వాత కలువు' వెళ్లమని కళ్లతో చెప్పింది.

పార్వతి గుండె ఝల్లుమంది. అంతా అయోమయం... భయం, కోపం పొంగుకొస్తున్నాయి. హరినాథశాస్త్రి నవ్వుతూ వెళ్లి రిక్షాలో కూచున్నాడు 'పదరంగన్నా!' రంగన్నకు సైగ.

'గిదేంది పంతులూ! గీమె మీ మేనత్తనా?"

గబుక్కున చెయ్యి ఝాడించింది పార్వతి. జగదాంబ నుండి విడిపోయి రిక్షా దగ్గరకొచ్చింది. శాస్త్రిని గుర్రుగా చూస్తోంది.

'అవును. ఆమెనే మా జగదాంబాత్త!!' హరినాథశాస్త్రికి కోపమొచ్చింది. 'నేనో గంటలో తిరిగొస్తా నవ్వుండు' పార్వతి భుజమందుకుని జగదాంబ ముందుకు తోసాడు.

'మోసం.... దగా!" గట్టిగా అరిచింది పార్వతి. ముప్పయ్యేళ్ల రంగన్న మొహంలో రంగులు మారాయి.

'గిదేంది శాస్త్రీ! ఈ సారి ఈ పిల్లతోని వస్తుంటేనే అనుమానమొచ్చింది. ఈమెను జగదాంబ కంపెనీకి అమ్మావా?' నిర్మొహమాటంగా అడిగాడు.

'అబ్బా! అమ్ముకుంటున్నానో, నమ్ముకుంటున్నానో అదంతానీకెందుగ్గాని... నువ్వు పాతోడి పని నీ రిక్షా ఏక్కేసిన.' విసుగ్గా రిక్షా దిగి బెదిరించాడు.

'మనం పోదాం పద! జగదాంబ పార్వతి భుజాలందుకుంది.

'నడువే పోరీ! అన్నింటికి నేనున్నాగద బిడ్డ. పాసింజర్లొచ్చే టైమయింది. మర్యాదగ లోపలికి నడువ్' లోపలికి లాక్కెల్తుంది.

'అమ్మా... జగదాంబమ్మా' అటు ప్రతిఘటిస్తూనే ఇటు బతిమాలుతోంది. పార్వతి. 'నన్ను పెండ్లి జేసుకుంటానని పట్టుకొచ్చిండీ పంతులు. నేనటువంటి దాన్ని కాదు. నీకు దండంబెడ్తా నన్నిడిచిపెట్టు' పెనుగులాడుతోంది. ఏడ్చినా, మొత్తుకున్నా ఆలకించేవారెవరు? పట్టు బిగుస్తూనేవుంది.

రోషం, కోపం, అసహ్యం కలెగలుపుకొచ్చి పార్వతి గుండెలెగసి పడుతున్నా, బలాన్నంతా భుజాల్లోకి తెచ్చుకొని ఒక్కతోపు తోసింది. జగదాంబ బొక్కబోర్లా పడిపోయింది. ముక్కూ మూతి ఒక్కటై పోయినై.

'దండంబెడ్త రంగన్నా... నన్ను రక్షించు' పార్వతి వెనుదిరిగి రంగన్న కాళ్లకు చుట్టేసింది. ఆవేశం పొంగుతూనే వుంది.

'తప్పు శాస్త్రి! గట్లా మోసం పాపం!' హరినాధశాస్త్రిని సముదాయించ బోయాడు రంగన్న. శాస్త్రికి సుర్రుమంది.

'నాకు తప్పొప్పులు చెప్పేందుకు నువ్వెవనివిరా' ఒక్క పరుగుతో వచ్చి రంగన్న పీక అందుకున్నాడు.

'ఓర్నీయవ్వ! నువ్వా నేనా!' కోపం కపాలానికింటింది.

'నూనెల ముంచి తీసిన ఏకు లెక్కున్నావ్. నువ్వు నామీది కొస్తావుబే!' గట్టిగా తోసిపారేశాడు.

'హరిహరీ!" అంటూ హరినాధశాస్త్రి జగదాంబమీద పడిపోయాడు.

'వామ్మో శాస్త్రి! నీకు చావురాను....'

జగదాంబ తిట్ల పురాణం విప్పింది శాస్త్రి మొహమ్మీద గట్టిగా అరించిది. బక్క పలుచని శాస్త్రి అమాంతం పక్కన పడిపోయాడు.

పార్వతి రిక్షా ఎక్కడం, రంగన్న పిక్కబలం చూపించడం క్షణాలలో జరిగిపోయింది.

ముక్కులోంచి కారుతున్న రక్తాన్ని చూసుకొని బెదిరిపోయాడు శాస్త్రి 'నా అడ్వాన్స్ నాకిచ్చేయ్' జుట్టు అందుకుంది జగదాంబ.

జనారణ్యంలో రంగన్న రిక్షా... సందులన్నీ దాటేసి మెయిన్ రోడ్డు మీద పరుగెడుతోంది. తాబేలులా ముడుచుక్కూచున్న పార్వతి ఊపిరి పీల్చుకుంది. బెదురు చూపులు రోడ్డుపక్క షోరూముల మీద వాలి చెదిరిపోతున్నాయి. ఇప్పుడెట్లా... ఏంచెయ్యాలో... అయోమయం.

'నువ్వు భయపడకు పార్వతీ. మా ఇంటికి పోదాం?" రంగన్న భరోసా.

'సరే....'

'కాని.... నువ్వెవరో!' అమాయకంగా అడిగింది. రిక్షా మలుపుతిరిగింది.

"నేనా!... నేను రిక్షా రంగయ్యను. మాదో పల్లెటూరు. అమ్మాఅయ్యలు లేరు. కౌలు భూమిని నమ్ముకొని ఓ వగలాడిని పెండ్లిజేసుకున్నాను. దాని వయ్యారాలకు, షోకులకు నా సంపాదన సరిపోలేదు. ఇల్లు అమ్మేసిన. ఆ తరవాతది ఎవనితోనో లేచిపోయింది. నేను ఈ సిటీకొచ్చిన. కాయకష్టం జేసుకుంట గీ లేబర్ కాలానీలో గుడిశె కొనుక్కున్నా' అప్పటికి మరో రెండు సందులు.

తిరిగి రిక్షా ఓ తాటాకుల గుడిశె ముందాగింది. గుడిశె చుట్టూ మరెన్నో గుడిశెలున్నాయి. అతుకుల బతుకుల కాసరాగా అక్కడక్కడా పెంకుటిళ్లు గూడా వున్నాయి.

తడబడే అడుగులతో వరుని వెంట వధువులా రంగన్న వెంట లోపలికి నడిచింది పార్వతి. గుడిశెనంతా చూపులతో తడుముతోంది. నలభై నెంబరు బల్బు వెలుతురు ఇంటినిండా పరుచుకుంది. పార్వతి నరాల్లో నూతనోత్సాహం పరుచుకుంది.

పూనాపాంటు, ఆఫ్‌షర్టు, పొట్టి జుట్టు, పొడగాటి మీసాలు.... మేకప్‌లో వున్న మెగస్టార్ చిరంజీవిలా కన్పించాడు రంగన్న.

'వంట వస్తదా, చేసి చూపించాలినా?" మూలనున్న వంట సామగ్రి చూపిస్తే అప్యాయంగా అడిగాడు రంగన్న. పార్వతికి ధైర్యమొచ్చింది.

'వంట నాకొస్తది. చేస్తా' డబ్బాల మూతలు తీసి చూస్తోంది.

'ముగురికి వంటజేయ్'

మూడో మనిషెవరో! అతడు కష్టజీవికదా. ఎక్కువతింటాడేమో! రంగయ్య మనస్తత్వమొటువంటిదో బిక్కుబిక్కుమంటూ బియ్యం కడిగింది. మానవ మృగాల మధ్య గతాన్ని భవిష్యత్తుతో బేరీజు చేసుకుంటూ పొయ్యి అంటించింది.

ఏదో ఆలోచిస్తూ పచార్లు చేస్తున్నాడు రంగన్న, నిమిషానికొసారి బయటకెళ్ళి చూసొస్తున్నాడు. పార్వతికర్థంకాలేదు.

'ఇంకెవరన్నా వచ్చేదుందా?'గుండెలు బిగపట్టి వంకాయలు కోస్తుంది.

'మా పిల్లగాడు రావాలె!'

పిల్లగాడా! పోరన్ని కనిపారేసి లేచిపోయిందేమూ పెళ్లాం. దానికేం మాయరోగమో ... గింతమంచి మనిషినొదిలిపెట్టి పోయింది... ఆలోచనల అగ్నిగుండాలు దాటుతూంటే వంట పూర్తయింది. వచ్చి రంగన్న కెదురుగా కూచుంది. 'తింటావా' అదోలా చూస్తూ అడిగింది.

'కొంచెం సేపాగుదాం' గుమ్మానికెదురుగా కూచున్న వాడల్లా వీపు గోడకానించాడు.

'సరే...! చెక్కిళ్ల మీద తచ్చాబుతున్న ముంగురుల్ని సవరించుకుంది. తానుగూడా గోడకొరిగి రెండుమూకాళ్ల మీద కూచుంది. కళ్లు అప్పుడే వెలిగించిన జ్యోతులైనాయి. ఆ జ్యోతుల్ని రంగన్న చూపులు నేరుగా స్పర్శించాయి.

.....ఈ పిల్ల గంతమంచిగుంది. గా శాస్త్రిగాని కెట్ల దొరికిందో! వాడోట్ల కిలాడి అని తెల్వదెమో! జగదాంబ కంపెనీలో అమ్మేస్తడని అసలే తెల్వదేమో!.... రంగన్న చూపులు నిలబడి పోయినై.

గట్లా చూస్తున్నాడెందుకో!.. పార్వతి గుండెల్లో గుసగుసలు. ఎందుకైనా మంచిదని చూపులు నేలకు వాలివై.

'నువ్వెవలు? గా బద్మాష్ బాపనయ్య చేతుల కెట్లొచ్చినవ్?' మనసు విప్పి అడిగేశాడు రంగన్న. తన సంగతంతా అతనికి చెప్పాలనుకుంది. తానె అడిగాడు. మోకాళ్ళనుంచి తల తీసి గోడ కానించింది. వెన్నుపూసలోంచి సన్నని నిట్టూర్పు తోసుకొచ్చింది. వాలకం గంభీంమైంది.

'మా ఊరు వేములవాడ పుణ్యక్షేత్రము. మా అమ్మ పార్వతి..

'అగో ...మీ అమ్మ పేరుకూడా పార్వతేనా?' ఆశ్చర్యం.

'పార్వతి...మా పేర్లుకావు. లోకమంతా గట్లాంటది. మా అమ్మ అసలు పేరు భారతి. నా పేరు సుశీల. మానాన్న ఎవరో తెల్వదు.

'అరె..గదేందీ?'

'అదంతా.... అది మా ఆచారముట'

'ఆచారమా, గ్రాచారమా, గదేందో!' గోడకొరిగిన రంగన్న తల ముందుకొచ్చింది.

'అది మా తల రాత.....'

'గట్లా కప్పి చేప్తె నా కర్థమైతదా? జెర ఇప్పి చెప్పు.'

'మా అమ్మనేకాదు, అమ్మమ్మ, వాళ్లమ్మ, అమ్మమ్మలు గూడా పార్వతులే. మా ఆచారం ప్రకారం ఆడపిల్ల పెద్దమనిషి కాగానే పరమేశ్వరుని పెండ్లామై పోతది. పదిహే నేండ్లు దాటంగానే రాజరాజేశ్వర స్వామి గుడిలో పరమేశ్వరునితో పెండ్లి జరిగిపోతది. కొందరు ఊరి పెద్దలు, మరికొందరు పూజారులు దగ్గరుండి పెండ్లి జరిపిస్తారు.....'

'ఆగు....' రంగన్న మెదడుపొరల్లో రంగుల అనుమానాలు. భృకుటి ముడిపడింది. 'అదికాదు. విగ్రహరూపమున్న పరమేశ్వరుడు మీ మెడల తాళిబొట్టు ఎట్లా కడ్తడు? సంసారమెట్లా జేస్తడు?'

నిర్వేదమైన చిరునవ్వు పార్వతి పెదాల మీద మెరిసి మాయమైంది.

'పేరు పెరుమాండ్లది, అరగింపు అయ్యగారిదన్నట్లు దేవుని పేరుమీద మానవదయ్యా లుంటారు గదా! అంటే... పూజరయ్య తాళిబొట్టు కడ్తాడు. అటెన్క పలుకు బడున్న ధనవంతునితో శోభనం జరిగిపోతది. పొద్దంతా మొకం నిండా పసుపు కుంకుమలతోని పార్వతి వేషంలో బిచ్చమెత్తాలి. రాత్రి చీకటి బాగోతానికి తయారావాలి. బతుకంతా గట్టనే గడపాలని దేవుడు మా తలమీద రాసి పెట్టిండట. మాతోని సంభోగానికి అందరు తయారే, కాని మాకు రోగమొస్తే పట్టించుకునే నాథుడేలేడు. వయసులో ఉన్నన్ని రోజులు మా రక్త మాంసాలతో ఆడుకుంటారు. ఆ తర్వాత అనాథ అంటారు. కష్టమొచ్చినా, దావొచ్చినా మా అందాలతోని ఆడుకొన్నవాళ్లెవ్వరూ కన్నెత్తి చూడరు. అనాథగా కుక్కచావు

చచ్చినా కనికరించే వాళ్లుండరు...' గొంతులో బాధ గురగురలాడ్తోంది. తడిసిన కళ్లను కొంగుతో అద్దుకుంటోంది.

బయట వీధిలైటు వెలుగులతో పున్నమివెన్నల పోటీ పడుతోంది. ఇంటి ముందున్న వేప చెట్టు కొమ్మలు అంతా వింటున్నామంటూ తలలాడిస్తున్నాయి.

'మరి... నీకు ఎవలతో శోభనమైంది?' అడగలేక అడిగాడు.

'ఎవలో జమీందారట. ఏ ఊరో ఏమో! అంతా మా అమ్మ కెరుక. పెండ్లంటే, సంసారమంటే ఏందో నాకు సరిగా తెల్వదప్పుడు. కాని.... ఆరోజు తెల్ల చీర కట్టించి, తలల మల్లెపూలు పెట్టి మంచిగ అలంకరించి గదిలోకి పంపించిన్రు. అట్లనే మూడు రాత్రులైపోయినాయ్. అమ్మ కూడా అదే ఆచారాన్ని పాటించాలన్నది. అటెన్క మా ఇంటి పక్క పూజారయ్య పెద్దకొడుకు హరినాథశాస్త్రి ప్రేమతోని పలుకరించాడు. మా అమ్మ ముందటనే మంచిమాటలు చెప్పుకుంట నన్ను గదిలకు తీస్కపోయిండు... గప్పట్నాంచి అతడే ఇంటి కొస్తున్నాడు. అప్పుడప్పుడు పెద్ద పెద్ద ఆఫీసర్ల దగ్గరికి నన్ను పంపించేటోడు. ఎనిమిదేండ్ల కింద నాకో కొడుకు పుట్టిండు. వాడు తన కొడుకు కాదన్నడు హరినాథశాస్త్రి. బడిలోని పిల్లలంతా వాడిని అసహ్యంగా తిట్టేటోల్లట. నీ అయ్య ఎవడ్రా అని కూడా ఎక్కిరించేటోల్లట. రోజూ ఇంటి కొచ్చినంక తనతండ్రి ఎవరో చెప్పమని ఏడ్చి మంకు పెట్టెటోడు. సముదాయించలేక సిగ్గుడిచి చెప్పలేక వాని చెంపలు వాయించి బోర్మని ఏడ్చేదాన్ని. నాతోటి ఆడోళ్లు గౌరవంగ బతుకుతుంటే దేవుడా, నాకెందుకీ శిక్ష అని కుమిలి కుమిలి ఏడ్చేదాన్ని. హరినాథశాస్త్రి కెంతజెప్పినా ఇటువిని అటు వదిలేసెటోడు. లేడిపిల్ల లేత మాంసానికి మరిగిన తోడేలోలే వచ్చిపోయేటోడు.

ఆర్నెల్ల కింద నా కొడుకు అతన్ని నాయనా అని పిలిచిండు. అంతే.... శాస్త్రి పండ్లు కొరుక్కుంటూ మావోని చమ్డాలూడగొట్టిండు. కొడుకు, కంటికి రెప్పోలే చూసుకుంటున్న కొడుకు మాయమై పోయాడు. ఎక్కడికి పోయిండో... తెల్వదు. గొడగొడ ఏడ్చిన... లాభంలేదు. మొన్న అంతా గుర్తు కొచ్చింది శాస్రి ముంగట దుఃఖమాగలేదు. 'ఇంగనేను ఎవలికోసం బతకాలె?' నని అడిగిన.

శాస్రి ప్రేమగా నా చెంపల మీది కన్నీళ్లను అద్దిండు. కౌగిట్ల బంధించి 'నాకు సిటీలో ఉద్యోగం దొరికింది. మనమిద్దరం సిటీకి పొయ్యి అందరి ముందు పెండ్లిజేసుకొని హాయిగా ఉందాం' అన్నాడు. కమ్మని ముచ్చట్లతోని కరిగించిండు. నా కెంతో సంతోషమైంది. సిటీలో నాకొడుక్కోసం దేవులాడొచ్చు. వాడు దొరుకోచ్చు... అని మురిసిపోయిన. కాని... శాస్త్రి గంత మోసగాడనుకోలేదు. నా కొడుకుని గూడా వాడే మాయంజేసి చంపిచిండేమో....!" గుండె నరాల్లోంచి తోసుకొస్తున్న దుఃఖం బిందు రూపందాల్చి, కంటిధారలై జారి ఛాతిమీదికి దుంకుతోంది.

రంగన్న ఎదపొదలో తుఫానులాంటి అలజడి....

సుఖం మనిషిని కరిగిస్తుంది. దుఃఖం మనసును కరిగిస్తుంది. సుఖం లోకాన్ని మరిపిస్తుంది. దుఃఖంలోకం పోకడ చెప్తుంది. సుఖం ఎదుటి సుఖాల్లో పాలుపంచుకోవాలంటుంది. ఎదుటి మనిషి దుఃఖం.... ఏదైనా సాయం చేస్తే పుణం పురుషార్థమంటుంది.

రంగన్న మనసు రెక్కలు టపటపలాడినై.... ఒంటిగాణ్ని సొంటి కొమ్మోలైపోతున్న నాకు తోడు ఆ శంకర్ పోరగాడు. మా ఇద్దరి బతుకుల్ని ముడేసి పట్టుకునేందుకు మూడుముళ్లు వేయించుకున్న ఆడదొకటుంటే హాయిగుంటుంది..... బుర్రలో మెలికలు తిరిగిన ఆలోచన బయటికొస్తుంది.

'నాకు దిక్కులేరు. నీకు సక్కి లేరు. మనం పెండ్లి జేసుకుందామా? మొహం ప్రశ్నార్థకమైంది.

పెండ్లి.... ఆహా ఎంత తియ్యని మాట. ఒలంపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించినట్టు... అమాట పార్వతి పాలిట వరాల మూటయింది. జానెడు పొట్టకోసం బోలెడంత మంది క్షేత్రపాపుల మధ్య బిచ్చగత్తెగా తిరిగే బదులు రంగయ్య భార్యగా బతకమెంతో తృప్తి... పార్వతి కళ్లు పరం జ్యోతుల్లా వెలిగాయి. అంతరాలాల్లో జీవం పోసుకున్న నును సిగ్గులు పెదాలను కదిలించినై బుగ్గలు ఎర్రబారినై.

గుండె చెలమల్లో ఊరిన ప్రేమ జలధార ఇద్దరినీ లేచి నించో బెట్టింది.

శుభ్రమైన చూపులు కలసిన శుభవేళ.....

'నాన్నా!' ఎనిమిదేళ్ల శంకర్ పరుగెత్తుకొచ్చి రంగన్నను చుట్టేశాడు. 'నీకోసం ఇంతసేపూ చూసిన. ఎక్కడికి పోయినవ్?' అంటూంటే పసి బుగ్గల శంకర్ చూపులు పార్వతివైపు మళ్లినై.

రంగన్నకు లోకమంతా పంచరంగుల చిత్రంలా కనిపించింది. ఆణ్ణి పార్వతికి చూపిస్తూ. 'వీడు నాకు ఆర్నెల్ల కింద సిటీ బస్టాండుల దొరికిండు. నేను పెంచుకుంటున్న కొడుకు నీగ్గూడా కొడుకేగదా! పట్టరాని సంతోషంతో శంకర్ చెయ్యందుకుని పార్వతి కందించాడు.

ఎనిమిదేళ్ల వయసులోపలే ఎన్నో అవమానాలను, అనుభవాలను మూటగట్టుకున్న శంకర్ పసి హృదయం నమ్మలేకపోయింది. కలనో, నిజమే తేల్చుకోలేక నిశ్శబ్ద శబ్ద తరంగాలలోని ఆనందాన్ని అనుభవిస్తూంది.

అమితానందం, ఆశ్చర్యం, ఉత్సాహం, ఉద్వేగం నరాలలో పాకుతుంటే ఉక్కిరి బిక్కిరైన పార్వతి ఉద్విగ్నంగా శంకర్ నుదురు ముద్దాడింది. ఒడిలోకి లాక్కొని గుండెలకు హత్తుకుంది. వాత్సల్యంగా వీపు నిమురుతూ.

'వీడు... ఈ శంకర్ నాకన్న కొడుకు రంగయ్యా! నా పేగుబంధం తప్పిపోయిందను కున్నా. నా కొడుకు నాకు దొరికిండు. నిజంగా వీడు మన కొడుకేనయ్యా' గొంతు పూడుకుపోయింది.

లేబర్‌కాలనీ... శ్రీ వెంకటేశ్వరాలయంలో గంటలు అదేపనిగా మోగతున్నాయి. నాదస్వరాలు విన్పిస్తున్నై. ఆ రోజుకు చివరి హారతి సందర్భముగా వేదమంత్రాలు రాగయుతంగా వినబడుతున్నై.

'అమ్మా... మల్లా గా శాత్తిరి వస్తడా?' భయం భయంగా అడిగాడు శంకర్. పసివాడిని కిందకి దించింది పార్వతి. దారాలకి పసుపుకుంకుమ రాసింది. దానికో పసుపుకొమ్ము కడుతూ 'ఇక్కడి కెవ్వలూ రారు. వస్తే మీనాన్న రంగయ్య ఊకుంటడా?' రంగన్న కళ్లలోకి సూటిగా చూసింది. పసుపుతాడు అతని చేతి కందించి మెడలు వంచి ముందు కూచుంది. సిగ్గులు సింగారించుకున్న చెంపలు కెంపులైపోతున్నాయి.

ఇంటిముందు వేపచెట్టుమీది పక్షుల కిలకిలారావాలు గుడిగంటల చప్పుళ్లు, నాదస్వరాలకు, వేదమంత్రాలకు తోడైపోయినై. మూడు గుండెల చప్పుళ్లకు తాళంవేస్తున్నై.

సుశీల మెడమీద రంగయ్య వేళ్లు నాట్యంచేస్తూ మూడుముళ్లు వేస్తూంటే శంకర్ కేరింతలు కొడుతూ నాట్యం చేస్తున్నాడు.

**ఆంధ్ర దర్శని - వెబ్‌సైట్ పత్రిక - 6-05-2004**

★★★★

